

అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాపట్ల: చందోలులోని బగళాముఖి దేవస్థానంలోని అమ్మ వారిని కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి జూలకల్లుకి చెందిన చలంచర్ల వెంకటేశ్వర్లు దంపతులు రూ.1.01,116 అందజేశారు.



అగ్రి ల్యాబ్ తనిఖీ

నరసరావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన పథకంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను మంగళవారం థర్డ్ పార్టీ ఎవాల్యేషన్ బృందం పరిశీలించింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
బాపట్ల	6.21	5.06
నరసరావుపేట	6.23	5.08
గుంటూరు	6.21	5.06

ఇంటింటా ప్రకృతి సేద్యపు పంట

- అర ఎకరం భూమిలో 26 రకాల పంటలు
- 16 రకాల న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసిన మహిళ సుజాత
- అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మార్టూరు: అరెకరా భూమిలో ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా రుచికరమైన 26 రకాల కూరగాయల పంటలను ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు మండల ప్రకృతి సేద్యపు సిబ్బంది. మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాసరావు భూమిలో చేస్తున్న ఈ ప్రయోగం స్థానిక రైతులను, మహిళలను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ భూమిలో సిబ్బంది 11 రకాల ఆకుకూరలు, ఆరు రకాల దుంప జాతి, ఏడు రకాల కూరగాయలు, బంతి, ఆముదం వంటి ఎర్ర పంటలను అంతర పంటలుగా సాగు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ప్రధాన పంటగా కాకర పాదులు నేలపై పాకే విధంగా కాకుండా ఫెన్సింగ్ పైకి అల్లుకునే విధంగా సాగు చేస్తూ ఒక్కో సాలుకు మధ్య పది అడుగుల భూమిని వదిలారు. కొన్ని సాళ్ల మధ్య క్యాలీఫ్లవర్, క్యాబేజీ, బీన్స్, అనప, పప్పు చిక్కుడు వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. మరికొన్ని సాళ్ల మధ్యలో పాలకూర, చుక్కకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, తోటకూర వంటి 11 రకాల ఆకుకూరలతోపాటు ఎర్ర పంటలైన బంతిపూలు, ఆముదం చెట్లు సాగు చేస్తున్నారు. దుంప జాతి రకాలైన ముల్లంగి, క్యారెట్, బీట్ రూట్, చిలగడ దుంపలు తదితర ఆరు రకాల మొక్కలతో నోరూరిస్తున్న పంటలను స్థానిక రైతులు ఆదర్శంగా తీసుకొని తమ ఇంటి పెరట్లో సైతం ఇలాంటి పంటలను సాగు చేయడం గమనార్హం.



బొల్లాపల్లి గ్రామంలో కాకర పంటలో అంతర పంటలను చూపిస్తున్న ప్రకృతి సేద్యపు సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయం వద్ద కూరగాయలు విక్రయిస్తున్న ప్రకృతి సేద్యపు సిబ్బంది

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి

రైతులు, ప్రకృతి సేద్యపు సిబ్బంది క్షేత్రస్థాయిలో కష్టపడి పండిస్తున్న పంటలకు ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించి గిట్టుబాటు ధరలు కల్పిస్తే ప్రజలకు రసాయనిక రహిత ఆరోగ్యకరమైన కూరగాయలు ఆకుకూరలు అందించవచ్చు. ఆసక్తి గల రైతులు విధానాన్ని పాటించాలి.

– వీరవల్లి కృష్ణమూర్తి, మండల రైతు సంఘం అధ్యక్షుడు.

డ్రిప్‌తో నీటి ఆదా..

ప్రతి సాలుకు ప్రత్యేకంగా అమర్చిన డ్రిప్ పద్ధతి ద్వారా నీటి సరఫరాతో పాటు వీరు స్వయంగా గోమూత్రం, ఆవు పేడ, ఆవు పాలు, ఆవు పెరుగు, నెయ్యి తదితర పదార్థాలతో తయారు చేసిన ద్రవ, ఘన జీవామృతాలు, పంచగవ్య తదితర కషాయాలను డ్రిప్ ద్వారా మొక్కలకు సరఫరా చేయడంతో ప్రతి పంట పెరిగి పచ్చదనం, పర్యావరణానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తుంది. సిబ్బంది మండల టీం లీడర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వీరు పండించిన కూరగాయలు ఆకుకూరలను ప్రస్తుతం బొల్లాపల్లి, కోలాలపూడి, దర్శి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే సరఫరా చేయటం గమనార్హం. ప్రతి సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సిబ్బంది స్వయంగా స్టాల్ ఏర్పాటు చేసి స్థానికులకు, ఉద్యోగులకు తాము పండించిన కూరగాయలు విక్రయిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. బొల్లాపల్లికి చెందిన గృహిణి అడ్డగడ సుజాతను వీరు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ తమ ఇంటి ముందు పెరట్లో 16 రకాల ఆకుకూరలు, కూరగాయలతో కూడిన న్యూట్రి గార్డెన్ గ్రామస్తులకు ఆదర్శంగా నిలుస్తోంది. కేవలం ప్రకృతిలో లభించే పదార్థాలతో వీరు తయారు చేసిన ఘన, ద్రవ జీవామృతాలు, పుల్లటి మజ్జిగ, కోడిగుడ్డు, నిమ్మరసం, తదితర పదార్థాలతో ప్రకృతి సేద్యాన్ని రైతులతో పాటు స్థానిక మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది శివశంకర్, రెహమాన్ బి, వైష్ణవి, శ్రీనివాసరావు, రాజేశ్వరి,శశికళ లను రైతులు రైతు సంఘం నాయకులు అభినందిస్తున్నారు.

ఆలపాటి గెలుపు



గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి నుంచి గెలుపు ధ్రువీకరణపత్రం అందుకుంటున్న ఆలపాటి

- మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే మ్యాజిక్ ఫిగర్
- 82, 390 ఓట్ల మెజారిటీ

సాక్షిప్రతినిధి,గుంటూరు: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. మొత్తం తొమ్మిది రౌండ్ల కౌంటింగ్ జరగగా మొత్తం పోలైన ఓట్లు 2,41,774కి గాను 2,14,865 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 26,909 ఓట్లు చెల్లలేదు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ 1,45,057 ఓట్లు సాధించారు. తన సమీప ప్రత్యర్థి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 62,737 ఓట్లు వచ్చాయి. దీంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ 82,320 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఈ విజయం దక్కించుకున్నారు. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో ఉండగా మిగిలిన వారెవరూ కనీస పోటీ ఇవ్వలేదు. మూడోస్థానంలో ఉన్న అన్నవరపు ఆనందకిషోర్‌కు 860 ఓట్లు దక్కగా గౌతుకట్ల అంకమ్మరావుకు అత్యల్పంగా 26 ఓట్లు దక్కాయి. మంగళవారం గుంటూరు కలెక్టర్ చాంబర్లో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

40శాతం మంది తొలిసారి ఓటర్లు

ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 40 శాతం మంది తొలిసారి ఓటు హక్కును ఉపయోగించుకున్నారని చెప్పారు. తనపై అసత్య ప్రచారం చేసినా ఓటర్లు గెలిపించారని పేర్కొన్నారు. సమస్యలపై శాసన మండలిలో గళం విప్పుతానని ఆలపాటి వివరించారు.

దొంగఓట్లు, రిగ్గింగ్‌తో గెలిచారు

పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

ఈ ఎన్నికల్లో దొంగ ఓట్లు, బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్‌లతో అధికార పార్టీ గెలిచిందని పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. ఫలితాల వెల్లడి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలను రాజకీయం చేసిందని, తనపై ప్రత్యర్థులు దుష్ప్రచారం చేశారని, ఉద్యోగులు, ఉపాధ్యాయ వర్గాల మధ్య చీలిక తెచ్చారని, రూ.కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. అనేక చోట్ల ఎన్నికల రోజు, దొంగ ఓట్లు, అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనికి అధికార యంత్రాంగం కూడా సహకరించిందని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు అనేక సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగ యువత, రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్ట్, అవుట్ – సోర్సింగ్, అనేక రంగాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటిపై పోరాటాలను కొనసాగిస్తానని కేఎస్ లక్ష్మణరావు ప్రకటించారు.

న్యూస్‌రీల్

రైతుల సంక్షేమం కోసం నాబార్డు కృషి

ఇంకొల్లు (చినగంజాం): కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నాబార్డు సంస్థ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు.. రైతుల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఉమ్మడి ప్రకాశం జిల్లా నాబార్డు డీడీవో రవికుమార్ అన్నారు. మంగళవారం రోటరీ భవనంలో ఇంకొల్లు సంరక్షణ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ సంబంధించిన ఎఫ్‌ఎస్ సెంటర్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఎఫ్ఈసీ సెంటర్ ఎండీ ఎం శ్రీనివాసబాబు, కార్యదర్శి జీ మంజూషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం వివిధ రకాల రాయితీలతో పాటు రైతులు వ్యాపారం చేసుకునేందుకు సరుకు నిల్వ చేసుకునే గోడౌను నిర్మించుకునేందుకు రుణాలు కూడా ఇప్పించటానికి నాబార్డు కృషి చేస్తున్నట్లు అన్నారు. రైతులు తమ పండించిన పంట ఉత్పత్తులు అమ్మకాల విషయంలో దళారీ వ్యవస్థతో నష్టపోతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు నష్టపోకుండా తాము పండించిన పంట ఉత్పత్తులు సమష్టిగా కలిసి అమ్ముకునేందుకు నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ సమావేశాలకు ఐదుగురికి ఆహ్వానం

సత్తెనపల్లి: అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రత్యేకత చాటుకున్న ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలకు ఈనెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జాతీయ సమావేశానికి ఆహ్వానం అందింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ఎంపీడీవో జీ లక్ష్మీదేవి, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామ సర్పంచ్ ఎం.లలితకుమారి, వెంగళాయపాలెం గ్రామ కార్యదర్శి వి.రవి, కొల్లిపర మండలం వల్లభాపురం సర్పంచ్ బి భ్రమరాంబ, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామ సర్పంచ్ షేక్ గౌసియా బేగం స్నేహపూర్వక పంచాయతీల (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను పంచాయతీలో అమలు చేస్తున్నారు. ఇందుకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సమావేశాలకు వీరికి ఆహ్వానం అందడంతో సోమవారం పయనమై వెళ్లారు.

నృసింహుని ఏకాదశ మాలధారణ దీక్ష స్వీకరణ



మంగళగిరిటౌన్: మంగళగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగువ సన్నిధిలోని పానకాలస్వామి వారి ముఖ మండపంలో మంగళవారం భక్తులు నృసింహుని ఏకాదశ మాలధారణ దీక్ష స్వీకరణ మహోత్సవం ఘనంగా జరిగింది. దేవస్థానం ప్రధాన అర్చకులు, గురుస్వామి మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు భక్తులకు మాలవేసి దీక్ష ఇచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు మాలధారణ దీక్ష స్వీకరించే భక్తులకు దీక్షా వస్త్రాలను ఉచితంగా అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, న్యాయవాది రంగిశెట్టి లక్ష్మి మాట్లాడారు. శివారెడ్డి గురుస్వామి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గోగినేని వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి సైదా నాయక్, శివాలయం మాజీ ధర్మకర్త అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, భక్తబృందం ప్రతినిధులు బుర్రి సతీష్, హనుమంత నాయక్, మాదల గోపీ తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్ల కలర్ ప్రింటవుట్‌ను అనుమతించం

డీఐఈఓ నీలావతిదేవి

నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను వైట్ పేపర్‌పై ప్రింటవుట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని పల్నాడు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి సోమవారం తెలిపారు. కొందరు విద్యార్థులు హాల్‌టికెట్లను కలర్ ప్రింట్‌లో తీసుకువస్తున్నారని, వాటిని అనుమతించటం లేదని పేర్కొన్నారు. ఈమేరకు ఇంటర్మీడియెట్ విద్యామండలి నుంచి ప్రత్యేక ఉత్తర్వులు అందినట్లు వివరించారు. విద్యార్థులు గమనించి తమ వెంట తెల్లకాగితంపై ప్రింట్ చేసిన హాల్‌టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

పంటకాలువల్లోని చెత్తను

యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పంట కాలువల్లో వేసిన చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు వద్ద మేజర్ కాలువను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. దిగువ ప్రాంతంలో పదివేల ఎకరాలకు సాగునీరు వెళ్లాల్సి ఉండగా చెత్త వేయడంతో కాల్వ పూడిపోతుందన్నారు. తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని, ప్రజలకు నష్టం వాటిల్లుతుంటే పట్టించుకోరా అంటూ అధికారులను ప్రశ్నించారు. డంపింగ్ యార్డు కోసం కేటాయించిన స్థలంలో చెత్త వేయనివ్వడం లేదని, కొందరు కోర్టులో కేసు వేశారని పంచాయతీ సెక్రటరీ, డిప్యూటీ తహసీల్దార్‌లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. డంపింగ్ యార్డ్ స్థలం లేక రహదారి పక్కనే ఉన్న కాలువలో వేయాల్సి వచ్చిందని తెలిపారు. సమీపంలోని శ్మశానవాటిక స్థలం, మిగిలిన ఖాళీ స్థలాలపై కలెక్టర్ ఆరా తీశారు. యుద్ధ ప్రాతిపదికన చెత్త తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తక్షణమే భూమి సర్వే చేసి 50 సెంట్లు భూమిని ఎస్‌డబ్ల్యూపీసీకి కేటాయించాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడం లేదని, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. నూతనంగా కేటాయించే స్థలంలో చెత్త సంపద కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఇకనుంచి చెత్త బయట కనిపించకూడదని అన్నారు. పంట కాలువలను ఆక్రమించి చెత్త వేస్తూ పర్యావరణం దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకుంటారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువల్లో చెత్త వేయరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు, పనుల మంజూరుపై అధికారికంగా ఉత్తర్వుల రాగానే గుర్రపు డెక్క వెంటనే తొలగించాలన్నారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జలవనరుల కాల్వల పర్యవేక్షణ ఈఈ మురళీకృష్ణ, ఆర్డీవో పి గ్లోరియా, ఆర్ అండ్ బీ డీఈ అరుణకుమారి తదితరులు ఉన్నారు.



పంట కాలువల పరిస్థితిపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత ఎస్వీఆర్ఎం కళాశాలదే

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

నగరం: తీరప్రాంతంలో ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలదేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాల వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి అనగాని పాల్గొని మాట్లాడారు. 1969లో వెలగపూడి రామకృష్ణ నగరంలో కళాశాలను స్థాపించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కళాశాలలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతో మంది ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. కళాశాల సేవలను ఈ ప్రాంతంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపాల్ హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో విజయమ్మ

అద్దంకి: ఏ వైద్యశాలలోనైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. ఆమె మంగళవారం పట్టణంలోని గాజులపాలెం యూపీహెచ్‌సీ, కాకానిపాలెం యూపీహెచ్‌లను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు వైద్యశాలల్లో స్కానింగ్ క్వాలిటీ పెంచాలన్నారు. స్కానింగ్ సర్టిఫికెట్ రెన్యువల్‌ను సమయానికి విధిగా చేయించుకోవాలన్నారు. ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొని విధులు బాధ్యతల గురించి వారికి వివరించారు. నిర్దేశించిన సర్వేలను, పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. సీడీ అండ్ ఎన్‌సీడీ సర్వేను పరిశీలించారు. పట్టణంలోని మూడు ప్రైవేట్ వైద్యశాలల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో గాజులపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయసింహ, కాకానిపాలెం వైద్యాధికారి హేమామాధవి, ఎంపీహెచ్ఈవో ఏ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ వీ వెంకాయమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ

మానవతా నాడి ‘పట్టా’లి

- రోగులపై దయ చూపాలి
- డీఎంఈ డాక్టర్ నరసింహం
- ఉత్సాహంగా వైద్య కళాశాల 74వ గ్రాడ్యుయేషన్ డే

స్టెతస్కోప్ చెవిన పెట్టకుండానే లబ్‌డబ్ సవ్వడి వీనులను తాకిందా.. మది నిండా ఉప్పొంగిన భావోద్వేగం ఆనందబాష్పమై కురిసిందా.. ఆరేళ్ల శ్రమ కనుల వేడుకై మెరిసిందా.. ఎన్నాళ్లో వేచిన హృదయం ‘పట్టా’భిషిక్తమై మురిసిందా.. అన్నట్టు గుంటూరు వైద్యకళాశాల సంతోషాల వేదికైంది. గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంతో ఉప్పొంగింది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మీయ ఆలింగనాలతో నవ్వులు చిలికింది. ఈ సంబరమంతా తళుకులీని కెమెరాల్లో అందంగా బందీయైంది.

గుంటూరు మెడికల్: వైద్యులు రోగుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం అన్నారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో 74వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. వైద్య కళాశాల 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు డీఎంఈ డాక్టర్ నరసింహం డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య రంగంలో మానవతా విలువలకు పెద్ద పీట వేయాలని చెప్పారు. వైద్య రంగంలో రోబోటిక్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వచ్చినా హ్యూమన్ టచ్ ఇవ్వలేవని, వైద్యుడికే అది సాధ్యమన్నారు. రోగిపై సానుభూతి, మానవతా దృక్పథం కలిగి ఉండాలన్నారు. వైద్యులు డబ్బుల కోసం ఆరాటపడకూడదని సూచించారు.



వైద్య విద్యయీభవ: పట్టాలతో నవ్వులు చిందిస్తున్న విద్యార్థులు

మాతృసంస్థ అభివృద్ధికి తోడ్పడండి

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో రూ.100 కోట్లతో ఎంసీహెచ్ నిర్మాణం జీజీహెచ్‌లో జరుగుతుందని చెప్పారు. 2026 జనవరి నాటికి భవనం అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వం రూ. 40 కోట్ల విలువ గల వైద్య పరికరాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య కళాశాలలో చదువుకున్నవారంతా వైద్య వృత్తిలో బాగా స్థిరపడిన తరువాత మాతృ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

యాంత్రిక వైద్యం వలదు

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి మాట్లాడుతూ రోగుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని, నేడు చాలా మంది వైద్యులు కఠినంగా మారిపోయారని వెల్లడించారు. రోబోమాదిరిగా యాంత్రికంగా వైద్యులు మారిపోయారని, వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా వైద్య వృత్తిలోకి వస్తున్నవారు మంచి మానత్వం కలిగిన వైద్యులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, జింఖానా కో ఆర్డినేటర్ పి.వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆడిటోరియం

వైద్య విద్యార్థుల డిగ్రీ పట్టాల వేడుకలను కనులారా వీక్షించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఫలితంగా వైద్య కళాశాల ఆవరణం, కళాశాల ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. గ్రాడ్యుయేషన్‌డే సందర్భంగా కళాశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఎక్కువగా రైతు కుటుంబాలకు చెందిన పిల్లలు వైద్యులుగా డిగ్రీ తీసుకుంటున్న నేపథ్యంలో ఈ కమనీయ దృశ్యాలను వీక్షించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేకంగా వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లను పెట్టుకుని హాజరవడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు డిగ్రీ పట్టాలు చేతపట్టుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కళాశాల ప్రాంగణంలోనే ఫొటోలు దిగి మురిసిపోయారు.



డీఎంఈ నరసింహంను సత్కరిస్తున్న దృశ్యం

రూ.2 కోట్ల నిధులు వృథా

- అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రం దుస్థితి
- ఏడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని దుస్థితి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

వేటపాలెం: గ్రామీణ క్రీడాకారులకు నిరంతరం శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహించడానికి ఏడేళ్ల కిందట రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన కేంద్రం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉండిపోయింది. దీనికి ఖర్చు చేసిన రూ.2 కోట్లు వృథాగా మిగిలిపోయాయని క్రీడాకారులు విమర్శిస్తున్నారు. 2017 మార్చిలో పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్టేడియం ఏర్పాటుకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అప్పట్లో దీని నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించారు. ఆ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మించారు. అప్పట్లో పనులు వేగవంతంగా సాగాయి. తరువాత పనులు నిలిచిపోయాయి. షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుతోపాటుగా క్రీడాకారుల కోసం ప్రత్యేక గదులు, ప్రేక్షకుల కోసం గ్యాలరీ ఏర్పాటు చేయాల్సి ఉంది. మరుగుదొడ్లు నిర్మించి వదిలేశారు. ఇంకా సగానికి పైగా పనులు మిగిలి ఉన్నాయి. క్రీడా వికాస కేంద్రం నిర్మాణం పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు గడిచినా దాన్ని ఇంతవరకు పూర్తి చేయకపోవడంపై క్రీడాకారులు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న క్రీడా ప్రాంగణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని క్రీడాకారులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రం

గురుకులంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

చెరుకుపల్లి: కావూరులోని గురుకుల బాలికల విద్యాలయంలో ప్రవేశం కోసం విద్యార్థినిల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యానిలయం కావూరు ప్రిన్సిపాల్ పి.నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 విద్యాసంవత్సరానికి విద్యార్థినిలు 5వ తరగతిలో చేరేందుకు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన బాలికలు మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినిలకు ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం విద్యానిలయంలో సంప్రదించాలని కోరారు.

వదినపై మరిది కత్తితో దాడి

ఆస్తి తగాదాలే హత్యాయత్నానికి కారణం

దగ్గుబాడు (కారంచేడు): కొన్నేళ్లుగా రెండు కుటుంబాల మధ్య జరుగుతున్న ఆస్తి తగాదాలు హత్యాయత్నానికి దారితీశాయి. ఈ ఘటన సోమవారం రాత్రి జరగగా బాధితురాలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై వీ వెంకట్రావు వివరాల మేరకు.. మండలంలోని దగ్గుబాడు గ్రామానికి చెందిన నాయుడు హనుమంతరావు, నాయుడు శ్రీరామమూర్తి అలియాస్ రాంబాబులు అన్నదమ్ములు. వీరి మధ్యన పొలానికి సంబంధించిన ఆస్తి తగాదాలు నడుస్తున్నాయి. గతంలో ఒకసారి నిందితుడు రాంబాబుపై కేసు నమోదైంది. ఈ క్రమంలో సోమవారం పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నం చేశారు. కానీ రాజీ కాలేదు. దీంతో కోపంలో ఉన్న రాంబాబు తన అన్న హనుమంతరావు భార్య (వదిన) విజయలక్ష్మిపై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో విజయలక్ష్మి చేతికి, తలకు మరికొన్ని చోట్ల గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం అర్ధరాత్రి కేసు నమోదైంది. నిందితుడిగా ఉన్న రాంబాబును ఎస్సై మంగళవారం అరెస్టు చేసి పర్చూరు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆర్మీ జవానుపై కేసు

చీరాల: ప్రేమించి పెళ్లి చేసుకొని ఓ బిడ్డను కన్న తర్వాత ఆ బిడ్డ తనకు పుట్టలేదని భార్యను వేధిస్తూ పుట్టింటికి పంపించివేయడంతో భార్య ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదుళ్లపల్లికి చెందిన లక్ష్మారెడ్డి కావూరి వారిపాలేనికి చెందిన కొచ్చెర్ల సుధారాణి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక చిన్న బాబు పుట్టాడు. అయితే మొదటి నుంచి భార్యను వదిలించుకోవాలని చూస్తున్న ఆర్మీ జవాను ఆ బిడ్డ తనకు పుట్టలేదని అనుమానించి ఆమె పుట్టింటి వద్ద వదిలేసి వెళ్లాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్మీ జవాను లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురపాలక సంఘు కార్యాలయము, రేపల్లె
బహిరంగ వేలము ప్రకటన
ఆర్.ఓ.సి.నెం.90/2023/A1 తేది. 04-03-2025
రేపల్లె పురపాలక సంఘము నకు సంబంధించిన కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్ ఆశీలు, కబేళా రుసుములు, విక్టోరియా సత్రము క్రింద గల పొలములు 2025-2026 సంవత్సరమునకు గుత్తకు తీసుకొని అనుభవించు హక్కులకు ది.17-03-2025న ఉదయం 11.00లకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణములో శ్రీయుత కమీషనరు గారిచే లేక వారి అనుమతిపొందిన వారిచే 2025-2026 సంవత్సరమునకు వేలము నోటిఫికేషన్ షరతుల మేరకు బహిరంగ వేలము జరుపబడును.ఇతర వివరములు ఈ కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.
సం/- కమీషనరు, రేపల్లె పురపాలక సంఘము

ప్రభుత్వ సమగ్ర వైద్యశాల గుంటూరు
ఆర్.సి.నెం.1790/HDS-F2/2023 తేదీ:04.03.2025.
టెండరు నోటీసు
గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నందు పనికిరాని సర్జికల్ ఐటమ్స్, పాత ఏ.సి.లు, సీలింగ్ ఫ్యాన్లు వాల్ ఫ్యాన్లు మరియు కంప్యూటర్ ఐటమ్స్ ఉన్నవి ఉన్నట్లుగా సీల్డు టెండరు ద్వారా విక్రయించుటకు నిర్ణయించడమైనది. ఆసక్తి గలవారు టెండరు ఫారములు కొరకు రూ.3,000/-లను ఆసుపత్రి అభివృద్ధి సంఘము, జి.జి.హెచ్. గుంటూరు వారికి చెల్లించి ది.05.03.2025 నుండి 10.03.2025 సాయంత్రము 05.00 గంటల వరకు పనిదినముల యందు పొందవచ్చును. టెండరు సమర్పించుటకు ఆఖరు తేది.11.03.2025 మధ్యాహ్నము 03.00 గంటలలోపు. టెండర్లు ది.12.03.2025న మధ్యాహ్నము 12.00 గంటలకు తెరువబడును.
సం/- సూపరింటెండెంట్
ప్రభుత్వ సమగ్ర వైద్యశాల, గుంటూరు.

బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక


ఎంపికైన ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్లు

బాపట్ల: బాపట్ల మున్సిపల్ హైస్కూలులో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన జట్లు ఈనెల 14,15,16 తేదీలలో కడప జిల్లాలో జరిగే అంతర జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని గుంటూరు జిల్లా (కబడ్డీ) సెక్రటరీ మంతెన సుబ్బరాజు తెలిపారు. బాలికల జట్టులో జె.ప్రవల్లిక, సారిక, కీర్తి, హాసిని, సలోమి, ఆసిఫా, అమూల్య, శ్రావ్య (నరసాయపాలెం), కీర్తన(పేరలి), అంజలి, భార్గవి (నిజాంపట్నం), మౌనిక, దుర్గ, యామిని (ఎంపీపాలెం), బాలుర జట్టు ఎస్.హేమంత్, జ.మహిమరాజు, ఎస్.కె జుబెల్, కె.మణికంఠరెడ్డి, శ్రీనివాసులు, ప్రభు, ప్రశాంత్ (మునిసిపల్ హైస్కూల్, బాపట్ల), సాయి హర్షవర్ధన్ రెడ్డి, నాగభూషణ్, తేజ, చిన్న అయ్యప్ప (కర్లపాలెం), సుబ్బారావు, పోల్‌రెడ్డి (పేరలి), ప్రేమ్‌చంద్, మణి (దాచేపల్లి)లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీలు కత్తి శ్రీనివాసరావు, ఎస్.కుటుంబరావు, పి. శైలజ, కోచ్ తిరుపతమ్మ (పి.ఈ.టి) ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి చదువే కీలకం

నోడల్ ఆఫీసర్ మాధురీ సిఫోరా


ఆశాలతో మాట్లాడుతున్న మాధురీ సిఫోరా

స్వర్ణ (కారంచేడు): బాలికల అభ్యున్నతికి వారికి అవసరమైన మంచి చదువే కీలకమని.. ఆశా నోడల్ ఆఫీసర్ మాధురీ సిఫోరా అన్నారు. మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆశాడే కార్యక్రమంలో ఆమె ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలతో మాట్లాడారు. ఈ నెలలో నిర్వహించనున్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఈ అంశంపై ప్రస్తావించిందన్నారు. గ్రామాల్లో బాలికలకు చదువును దూరం చేయవద్దన్నారు. వారు చదువుకోవడం వలన వారి భవిష్యత్‌కు పునాదులు వేసుకోగలుగుతారన్నారు. మంచి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. వివాహం కూడా సరైన వయస్సు వచ్చిన తర్వాతనే చేయాలన్నారు. అప్పుడే వారిలో పరిపక్వత ఉంటుందన్నారు. తద్వారా వారి కుటుంబాన్ని వారు చక్కదిద్దుకోగలుతారన్నారు. అలాగే గర్భిణులుగా ఉండే స్త్రీలలో రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో చింతాయపాలెం విద్యార్థికి బంగారు పతకం



చింతాయపాలెం(కర్లపాలెం): సౌత్ జోన్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలలో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పిట్టు చిన్నయ్యప్పరెడ్డి మెరుగైన ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తోట వెంకటరాజు తెలిపారు. మంగళవారం పాఠశాలలో క్రీడాకారులైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా ఎన్‌జి కాలేజీలో జరిగిన నాల్గవ సౌత్ జోన్ నేషనల్స్ షూటింగ్ బాల్ పోటీలలో ఏపీ జట్టు తరపున జూనియర్స్ విభాగంలో చిన్నయ్యప్పరెడ్డి ఆడి బంగారు పతకం సాధించాడని తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని యల్లావుల సలోమి అండర్ -14 బాలికల విభాగంలో విజయవాడలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో పాల్గొని తృతీయస్థానం సాధించిందని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.గోపీని ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా పీటీడీ ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

బాపట్ల: ఏపీపీటీడీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ బాపట్ల జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులుగా రాజేష్, సెక్రటరీగా ఎస్.విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృపాదనంలను ఎన్నుకున్నారు. ఆర్టీసీ డిపోల పరిధిలోని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని అధ్యక్షులు రాజేష్ పేర్కొన్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డులో మంగళవారం 66 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 43 బస్తాలు వచ్చాయి. వాటి గరిష్ట ధర రూ.8,500 కాగా కనిష్ట ధర రూ.8,300, మోడల్ ధర రూ.8,500 పలికింది. కాయలు 23 బస్తాలు వచ్చాయి. గరిష్ట ధర రూ.8,500, కనిష్ట ధర రూ.8,300, మోడల్ ధర రూ.8,500, మొత్తం 49 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

మిర్చి యార్డులో 1,27,375 బస్తాల విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు మంగళవారం 1,25,574 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,27,375 బస్తాలు అమ్మకాలు జరిగాయి. ఈ సీజన్‌లో ఈ స్థాయిలో మిర్చి బస్తాలు రావడం ఇదే ప్రథమం. శని, ఆదివారాలు మార్కెట్ యార్డుకు సెలవు కావడంతో ఆదివారం రాత్రి నుంచే వాహనాల్లో మిర్చి బస్తాలను తీసుకురాగా యార్డు నిండిపోయింది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,117 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

మహిళల గోప్యతకు డిజిటల్ భద్రత అవసరం

జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: సమాజ పరిస్థితులపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. మహిళ సాధికార వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో మహిళల గోప్యతకు డిజిటల్ భద్రత అవసరం, ఆత్మరక్షణ అనేది ఒక ఎంపిక కాదు అవసరం, మహిళలకు సురక్షితంగా పనిచేసే ప్రదేశం-వేధింపులపై మౌనాన్ని వీడడం, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు సురక్షితం-సవాళ్లు వాటి పరిష్కారాలు, మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంలో పురుషుల పాత్ర అనే అంశాలపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. విజేతలుగా నిలిచిన వారికి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నామన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతి గురించి అవగాహన కల్పించడం, మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలియజేయడం, మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకొని కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సేంద్రియ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి


అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

బాపట్ల: జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాలను ఆధునిక సేంద్రియ పద్ధతుల ద్వారా పండించడంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి అన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ చిరుధాన్య దిగుబడిని సాధించేరీతిగా రైతులను చైతన్యవంతం చేయడానికి హైదరాబాదులోని జాతీయ చిరుధాన్యాల ఉత్పత్తి కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఎక్కువ పోషక విలువలు కలిగి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే చిరుధాన్యాల సాగు ఆధునిక సమాజానికి ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. సాగుపట్ల అవగాహన పెంపొందించేందుకు ఆసక్తి గల కొందరు రైతులను ఎంపిక చేసి ఆ సదస్సులో పాల్గొనేందుకు బాపట్ల వ్యవసాయ కళాశాల అవకాశం కల్పించిందన్నారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఈ ప్రాంత రైతులు పాల్గొని చిరుధాన్యాల పంటల ఉత్పత్తి, నాణ్యతపై అవగాహన పెంచుకొన్నారన్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఉత్పత్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంలోని ఆవశ్యకతను తెలియజేసేందుకు ఈ సదస్సు దోహదపడిందన్నారు. వ్యవసాయ కళాశాల తరపున ప్రొఫెసర్ డాక్టర్ లాల్ అహమ్మద్ మొహమ్మద్ ఆధ్వర్యంలో డాక్టర్ జి.వినయ్‌కుమార్, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌లు సదస్సులో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

బెదిరింపులు మంచి పద్ధతి కాదు

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మేకల ప్రసాద్


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మేకల ప్రసాద్

బాపట్లటౌన్: పేదల విముక్తి పోరాటానికి నాయకత్వం వహించే నాయకుల్ని హత్య చేస్తామని బెదిరించడం విప్లవోద్యమానికి ద్రోహం చేయడమేనని అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. బాపట్లలోని డ్రైవర్స్ కాలనీలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ చంద్రన్న పార్టీ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఈ పద్ధతి మానుకొని ప్రజా ఉద్యమ నిర్మాణానికి పోటీ పడాలన్నారు. బాపట్లలోని మాజీ ఎంపీ మాదాల నారాయణస్వామి కాలనీలో ప్రజలు చంద్రన్న నాయకత్వాన్ని ధిక్కరిస్తే నాదెండ్ల బ్రహ్మయ్యకు పట్టిన గతే ప్రసాద్‌కు పడుతుందని కాలనీలో సమావేశాలు పెట్టి హెచ్చరించడం విప్లవ నిబంధనలను ఉల్లంఘించడమే అన్నారు. చంద్రన్న విప్లవ విధానాలను విడిచిపెట్టి ఆర్థిక నేరాలు, భూ పంచాయతీలు, భూమి కొనుగోలు, హత్యలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రన్న నాయకత్వంలోని న్యూ డెమోక్రసీ పార్టీని రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు వీడి మాతృ సంస్థ అయిన సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీతో చర్చలు జరిపి ఐక్యమయ్యారన్నారు. ఈ అక్కసుతోనే బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. దానిలో భాగంగా మా ఇంటికి వచ్చి బెదిరింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విప్లవ శ్రేణులు ఖండించాలన్నారు. సమావేశంలో పీవోడబ్ల్యూ బాపట్ల మండల అధ్యక్షులు కొండా అన్నమ్మ, డివిజన్ కార్యదర్శి మువ్వల పల్లవి పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


గుడ్డికాయలంక గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు

రేపల్లె రూరల్: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటంలో ప్రతి ఒక్కరూ సహకారం ఎంతో అవసరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బాపట్ల జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు చెప్పారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడ్డికాయలంక గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయాలను సమూలంగా రూపుమాపేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా నేరమని తెలిపారు. నాటుసారా సేవనంతో అనేక దుష్పరిణామాలు ఎదుర్కోనాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత కాలంలో యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ జీవితాలను పాడుచేసుకుంటోందన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులు ఎటువంటి దుర్వసనముల పాలు కాకుండా ఉండేలా ఉండాలంటే ముందు తాము సత్ప్రవర్తనతో కూడిన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. గ్రామంలో నాటుసారా తీసుకోవటంతో కలిగే నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేపల్లెలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో రేపల్లె ఎక్సైజ్ సీఐ దివాకర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామారావు, ఎస్ఐ రాజశ్రీ, వీఆర్వో హరీష్, మహిళా పోలీసు శ్రావణి, పేరం విష్ణు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి

- గొంతుకోసే యత్నం చేసిన దుండగుడు
- అడ్డుకుని దేహశుద్ధి చేసిన స్థానికులు
- ద్రోణాదుల బెల్ట్ షాపులో ఘటన


జాన్ దాడిలో చిన్నా తలపై అయిన గాయం


స్థానికులు కట్టి పడేసిన నిందితుడు జాన్

మార్టూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈఘటన మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. గ్రామంలోని ప్రభుత్వ వైన్స్ షాప్ ఎదురుగా గల బాషా రెస్టారెంట్ పేరుతో ఓ మహిళ బెల్ట్ షాపు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన ముప్పరాజు చిన్నా, షేక్ జాన్ అనే ఇద్దరు వ్యక్తులు రెస్టారెంట్‌లో కూర్చుని మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ప్రారంభమైన స్వల్ప వివాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. మద్యం మత్తులో క్షణికావేశానికి గురైన జాన్ రెస్టారెంట్లో ఉన్న కత్తి తీసుకొని మొదట చిన్నాను కాలితో బలంగా తన్నాడు. ఆ ధాటికి చిన్నా రెస్టారెంట్ బయట గల బురదలో పడగా జాన్ చిన్నా వెంటపడి కత్తితో తలపై బలంగా దాడి చేయడంతో గాయమైంది. జాన్ అంతటితో ఆగక చిన్నా మెడపై కత్తి పెట్టి కోసే ప్రయత్నం చేశాడు. అప్పటి వరకు ఈ తతంగాన్ని గమనిస్తున్న స్థానికులు ఒక్కసారిగా అప్రమత్తమై జాన్‌ను చుట్టిముట్టి అతని చేతిలోని కత్తిని బలవంతంగా లాక్కొని విడిపించారు. అనంతరం జాన్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు జాన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుడు చిన్నాను చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కోలలపూడి గ్రామానికి చెందిన 8 మంది యువకులు జొన్నతాళి సెంటర్‌లోని సూర్య దాబా నిర్వాహకులు ముగ్గురిపై మద్యం మత్తులో బీరు సీసాతో కొట్టి ధ్వంసం చేసి వారం రోజులు కూడా గడవక ముందే ద్రోణాదులలో ఈ ఘటన జరగటం మండలంలో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది.

రెండున్నర సవర్ల బంగారం చోరీ

నూతలపాడులో దొంగతనం


దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పర్చూరు(చినగంజాం): తాళం వేసిన ఇంట్లోకి చొరబడి దుండగులు బంగారాన్ని అపహరించారు. ఈఘటన మండలంలోని నూతలపాడు ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్సీకాలనీకి చెందిన నూకతోటి బెంజిమన్ నూతలపాడు సెంటర్‌లో నూడిల్స్ బండితో వ్యాపారం చేసుకుంటూ జీవనం చేస్తుంటాడు. మధ్యాహ్నం సెంటర్‌కు వెళితే తిరిగి రాత్రి 11 గంటలకు మాత్రమే ఇంటికి తిరిగి వస్తుంటాడు. సోమవారం ఎప్పటి లాగానే ఇంటికి తాళాలు వేసి బండి దగ్గరికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వెళ్లిన సమయానికి తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి కన్పించాయి. బీరువాలోని బంగారం వస్తువులు కనిపించకపోవడంతో ఒక్కసారిగా బిత్తరపోయాడు. రెండున్నర సవర్ల బంగారం దొంగతనానికి గురైందని గ్రహించాడు. దాంతో అతడు పర్చూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మాల్యాద్రి ఇంటి పరిసరాలను పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎదురెదురుగా బైకుల ఢీ

నలుగురికి గాయాలు


క్షతగాత్రులను చీరాల ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కారంచేడు: ఎదురెదురుగా వేగంగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకోవడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ఉన్నత పాఠశాల సమీపంలోని ఆదిపూడి రోడ్డు వద్ద జరిగింది. ఎస్సై వీ వెంకట్రావు వివరాల మేరకు.. చీరాల జాండ్రపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు అవిశాయిపాలెం వెళ్లి చేతికి అయిన గాయంకు కట్టుకట్టించుకొని తిరిగి చీరాలకు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో జాగర్లమూడికి చెందిన ఇద్దరు వ్యక్తులు వ్యక్తిగత పనులపై చీరాల వచ్చి తిరిగి జాగర్లమూడి వెళ్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వేగంగా వస్తూ అదుపుతప్పి ఢీకొన్నాయి. దీంతో వాహనంపై ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కారంచేడు ఏఎస్ఐలు బీ శేషసాయి, మధుబాబులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి సహకారంతో 108 వాహనంలో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వివరాలు నమోదు చేశారు. పూర్తి వివరాలు వచ్చిన తరువాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


శ్రీనివాసరెడ్డి (ఫైల్)

పర్చూరు (చినగంజాం): మండలంలోని రమణాయపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎన్నిరెడ్డి శ్రీనివాసరెడ్డి (34) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన తన భార్య వాసవితో కలిసి నివాసముంటున్నాడు. వారికి ఒకటిన్నర ఏడాది వయసు కలిగిన పాప కూడా ఉంది. ప్రస్తుతం భార్య గర్భిణి కావడంతో నెల రోజుల కిందట నూతలపాడు గ్రామంలోని తన పుట్టింటికి వచ్చి ఉంటోంది. దాంతో అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉంటున్న శ్రీనివాసరెడ్డి తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లో ఉరివేసుకొని మృతి చెందినట్లు మంగళవారం కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందింది. హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం గ్రామానికి తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు. అతని మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ 10th,ఇంటర్(ఒకేసంలో), డిగ్రీ(1-8సంలో) BA, B.Com, BSc, MA, MCom, MBA, MSc(All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥ శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11, బ్రాడీపేట, Gnt. 8555825538
■ Direct B.A, B.Com, B.Sc, B.Tech, M.Sc, M.B.A, M.C.A, M.Tech, M.A, M.Com, Diploma (EEE, ECE, Mech) Exam March. 7386406839

REAL ESTATE
■ గుంటూరు జిల్లాలో శ్రీ భ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్ మన్నెం లతీష్ గౌడ్. Ph: 98489 86831

PLOT FOR SALE
■ గుంటూరు గోరంట్ల లామ్ ఫామ్ ఎదురు అంజలి-3లో ప్లాట్ నెం-420 అమ్మబడును. అంజలి, మయూరి, అజయ్ కల్పతరువులలో లే అవుట్‌లు అమ్మదలచిన వారు సంప్రదించగలరు. 9866410052.

SERVICES

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉడ్యోగ్ స్థాపించండి. బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179

CHANGE OF NAME
■ I, DASARI KALYANA CHAKRAVARTHI (old name) S/o. Dasari Kanaka Durga Prasad, R/o D.No.4-22-6, Chaitanyapuri, Koritepadu, vtc: Guntur, po: Chandramouli nagar, Guntur Dt. 522007, AP, india, have changed my name (new name) Dasari Kalyan Chakravarthi S/o. Dasari Kanaka Durga Prasad. Hereafter my name is known as DASARI KALYAN CHAKRAVARTHI for all purposes.

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). 94757 50267

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

HOME CARE SERVICE
■ లలిత హోం కేర్ సర్వీస్, విజయవాడ. వృద్ధులకు, పేషంట్ల సేవకు ఇంటిపని / వంట పని / బేబీకేర్ కొరకు M/F వర్కర్లను 24/7 మీ ఇంటికి పంపగలము. ✆ 97054 91122, 94932 46482

MARRAIGE LINKS
■ క్రైస్తవ పెళ్లి సంబంధాల కొరకు సంప్ర: గుంటూరు భారత్‌పేటలో రోజూ 3 గం॥ క్రైస్తవ విజ్ఞాపన చేసేవారు కావాలి నెలకు 30 వేలు జీతం 2020 సం॥ తర్వాత కారు,ఆటోకొనడానికి కావాలి. 9347365650

PACKERS & MOVERS
■ Y K ప్యాకర్స్ & మూవర్స్ : గుంటూరు సిటీ జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో మీ ఇంటి సామాన్లు జాగ్రత్తగా చేరవేయు సంస్థ మరియు పాత కార్లు అ॥, కో॥ ✆ 7780624445, 9182196387

WANTED
■ ప్రముఖ స్కూల్ నందు 10th, ఇంటర్, డిగ్రీ చదివిన లేడీ టీచర్స్ కావలెను. మంచి జీతం. సంప్ర॥ 9550029851
■ ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్త్రీ/పురుషులు కావలెను. వయసు 18సం॥పైన Q:10th-డిగ్రీ, ఆకర్షణీయమైన సంపాదన. సంప్ర: 7702473949
■ APSRTCలో ఔట్‌సోర్సింగ్ లో విధులు నిర్వహించుటకు టికెట్ కండక్టర్లు & AC Busకు అటెండర్లు కావలెను.(విజయవాడ గుంటూరులలో) ✆ 8185864138
■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ఆంధ్ర హోమ్‌కేర్ ఆఫీస్‌కి కావలెను. మంచి జీతం+వ+భో. ✆ 91608 35559, 78158 35561
■ Wanted B.Pharmacy or D.Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PC1 Certificate Registration is mandatory. Cont: 6300975241

■ ప్రముఖ యూనివర్సిటీ నందు B.Tech అడ్మిషన్స్ చేయుటకు Lady Tele Callers / Admission Counsellores కావలెను. Qlf:B.Tech/MBA/ Degree. Sal : 15k to 20k + High Incentive. Contact:98856 88885,99499 95499.
■ కావలెను. కేర్ టేకర్స్, నర్సులు విజయవాడలో పేషంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు అత్యధిక జీతం+వ+భో. ఆంధ్ర హోమ్ కేర్, VJA ✆ 91608 35559, 93473 80332
■ Kotak బ్యాంకు అనుబంధ సంస్థలో పనిచేయుటకు రిటైర్డ్, VRS కావలెను అర్హత: SSC to PG, ఫిక్స్‌డ్ శాలరీ, PF, ESI + మెడికల్ బెనిఫిట్స్. ✆ 83175 95259
■ తెనాలి దగ్గర దుగ్గిరాల ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను జీతం 18000/-, డీజీ ఆఫ్, (సి.ఎల్), క్యాంటీన్ సదుపాయం కలదు. ✆ 9298011777, 8096161777
■ త్రినేత్ర హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ :18K. , Ph : 8520980099, 8520874499

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.